
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
సోమవారం 4 మార్చి 2024

ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు 5లో..

బండి సంజయ్‌కి టికెట్ ఖరారుపై బీజేపీ సంబరాలు 6లో..

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..



- ధరణిలో మార్పులకు అందిన మార్గదర్శకాలు
- కలెక్టర్ నుంచి అధికారాల బదలాయింపు
- ఈనెల 9వ తేదీ వరకు మండలాల్లో ప్రత్యేక డ్రైవ్

జగిత్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ధరణిలో మార్పులు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇటీవల మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. ధరణి పోర్టల్‌కు సంబంధించి...కలెక్టర్ల నుంచి తహసీల్దార్లు, ఆర్‌డీ వోలకు అధికారాలు విభజన చేసింది. మండల స్థాయిలో ప్రత్యేక బృందా లను సైతం ఏర్పాటు చేసింది. స్థానిక రెవెన్యూ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటుతో పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ధరణి సమస్య ల పరిష్కారంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ ఇ టీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాస్ రెడ్డిలకు కొన్ని సిఫార్సులు అందజేసింది. ఈనేపథ్యంలో ఇటీవల రెం డు వేర్వేరు ఉత్తర్వులను భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్త ల్ జారీ చేశారు. అన్ని స్థాయిల్లో ధరణి పరిస్థితిని పరిశీలన చేయాలని, వాటి వివరాలను కంప్యూటర్లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ప్ర భుత్వం ఆదేశించింది. దరఖాస్తును తిరస్కరిస్తే కారణాలను సైతం భూ యజమానులకు తెలియజేయాలని మార్గదర్శకాలు రెవెన్యూ అధికారులకు అందాయి. ధరణి సమస్యల పరిష్కారానికి సంబంధించి తహీసల్దార్ కార్యాలయ పరిధిలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో విచారణలు జరిపి నివేధికలను సంబంధిత ఉన్నతాధికారులకు పంపించనున్నారు. ప్రతీ దరఖాస్తుకు పరిష్కారం లేకపోతే తిరస్కరణ తెలియజేయాల్సి ఉంటుంది. దీంతోనైనా ధరణిలో అపరిష్కృత దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని బాధితులు ఆశపడుతున్నారు.

● ఈనెల 9వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్...

ఈనెల ఒకటవ తేదీ నుంచి 9 వరకు రెవెన్యూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించింది. రైతుల భూ సమస్యల పరిష్కారానికి మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఉ న్నతాధికారులు ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ కోసం ప్రతి మండలంలో మూ డు బృందాలు ఏర్పాటు చేశారు. ధరణి మాడ్యూల్స్‌ను అధికారుల వారీగా బదలాయించారు. తహసీల్దార్ల పరిధిలో అసైన్డ్ భూములు, వారసత్వం కోసం దరఖాస్తులు, ఖాతా విలీనం కోసం అందిన దరఖాస్తులు పరిష్కరిం చడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్‌డీవో స్థాయిలో పాస్ బుక్ లేకుండా నా లా కోసం దరఖాస్తులు, కోర్టు కేసులు, పాస్ బుక్ డేటా మార్పు, చేర్పులు పరిష్కరించనున్నారు. ఇతర మాడ్యూల్ పరిష్కారానికి తుది అధికారం కలెక్టర్ ఉంటుందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ధరణి దరఖాస్తుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌తో నైనా మోక్షం లభిస్తుందేమోనని భూ యజమానులు ఎదురుచూస్తున్నారు.

● అధికారుల విభజన..

ధరణి కమిటీ సభ్యుల సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయి లో రెవెన్యూ శాఖను పటిష్ట పర్చాలని నిర్ణయించింది. తహసీల్దార్ నుంచి ఆర్‌డీవోలు, రెవెన్యూ అదనపు కలెక్టర్ల వరకు కీలక బాధ్యతలు ఇస్తూ ఉ త్తర్వులు జారీ చేసింది. గతంలో కలెక్టర్‌లకు మాత్రమే ధరణి బాధ్యతలు ఉండగా...ప్రస్తుతం తహసీల్దార్లు, ఆర్‌డీవోలు, జిల్లా స్థాయి అధికారులు, సీసీఎల్‌ఏలకు అధికారాలు విభజన చేసింది. ఏ స్థాయి అధికారికి ఎలాం టి అధికారాలు ఉంటాయో మార్గదర్శకాల్లో వెల్లడించింది.

● జిల్లా వ్యాప్తంగా 3,370 దరఖాస్తులు పెండింగ్‌లు...

భూ సమస్యలను పరిష్కరించే అధికారాలను కలెక్టర్లకు అప్పగించడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 3,370 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. ఇందులో అత్యధికంగా పాస్ పుస్తకాల్లో సవరణకు వచ్చిన వాటిల్లో 1,936 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు గ్రీవెన్స్ దరఖాస్తులు 625, మ్యూటేషన్ కోసం వచ్చినవి 136, వారసత్వ సమస్యలు 141, కోర్టు కేసులు, పాస్ పుస్తకాలు 66, పాస్ పుస్తకాలు లేని నాలా దరఖాస్తులు 27, ఖాతా మెర్జింగ్ 33, పాసుబుక్కులు కలిగి నాల దరఖాస్తులు 139, నిషేదిత భూములు 267 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అదే విధంగా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకొని రద్దు చేసుకున్న వందల సంఖ్యలో గల రైతులు తిరిగి డబ్బులు ఖాతాలో జమ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వందల మంది రైతులకు సుమారు రూ. 20 లక్షల వర కు స్లాట్ రద్దుకు సంబంధించిన డబ్బులు ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

● ఏళ్ల తరబడి దరఖాస్తులు పెండింగ్...

భూ రికార్డుల ప్రక్షాళనకు గత ప్రభుత్వం 2020 అక్టోబర్‌లో ధరణి పో ర్టల్ తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌లో తలెత్తిన చిక్కుముళ్లతో చాలామంది రై తులు సతమతమవుతున్నారు. ముఖ్యంగా మిస్సింగ్ సర్వే నంబర్లు, భూ విస్తీర్ణంలో తేడాలు, నిషేదిత భూముల జాబితాలో నమోదవటం, వారస త్వ భూములు, మ్యుటేషన్లు, గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ తదితర మాడూల్స్ వల్ల రైతులకు కష్టాలు ఎదురయ్యాయి. భూ విస్తీర్ణంలో తేడాల పరిష్కా రం కాలేదు. సుమారు జిల్లాలో 3,370 దరఖాస్తులు అధికారులకు అందా యి. వీటిలో చాలా దరఖాస్తులు పరిష్కారం కాలేదు. 2023 ఫిబ్రవరిలో ధరణి పోర్టల్‌తో పాటు భూ సమస్యలకు పల్లెలోనే పరిష్కారం చూపాలని అప్పటి ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు. భూసమస్యల పరిష్కారానికి ప్రస్తుతం ప్రభుత్వం అడుగేయటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పోలియో రహిత సమాజం కోసం పాటుపడాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



చిన్నారికి చుక్కల మందు వేస్తున్న కలెక్టర్

జగిత్యాల టౌన్, మార్చి 3 : పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 93,836 లక్ష్యానికిగాను మొదటి రోజు అన్ని కేంద్రాల్లో 91,302 మంది చిన్నారులకు చుక్కల మందు వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. 97.3 శాతం లక్ష్యం పూర్తయిందని మిగతా రెండు రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయా లని ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీధర్ ఉన్నారు. పసి పిల్లల నిండు జీవితానికి తప్పనిసరిగా తల్లిదండ్రులు రెండు పోలియో చుక్కల మరిచిపోకుండా వేయించాలని పిలుపునిచ్చారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శ్రావణి

రాయికల్, ఫిబ్రవరి 3: క్రీడలు ప్రతి ఒక్కరిలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి అన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో శ్రీ వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లీపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బోగ శ్రావణి మాట్లాడుతూ గ్రామాల్లో యువతీ, యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని రాణించాలని అన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు అందిస్తున్నాయని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని టాస్ వేసి క్రికెట్ టోర్న మెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గంగారెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం, వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, ఫిబ్రవరి 3: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రాయికల్ ఎస్సై అజయ్ పేర్కొన్నారు. కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన చింతకింది రామచంద్రంకు ఇటిక్యాల గ్రామ శివారులో గల భూమి ఉంది. ఈ భూమి విషయంలో ఇటిక్యాల గ్రామానికి చెందిన మాదిగ కులస్తులకు తగాదాలు ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం రామచంద్రం జేసీబీ సహాయంతో భూమిని చదును చేస్తుండగా ఆపడానికి వచ్చిన వ్యక్తులను కులం పేరుతో దూషించాడు. దీంతో నాయిని ఆంజనేయులు ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాజీ సీఎంను కలిసిన జడ్పీచైర్‌పర్సన్



కేసీఆర్‌ను కలిసిన జడ్పీచైర్‌పర్సన్ వసంత, లోక బాపురెడ్డి

జగిత్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆదివారం జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ కలిశారు. హైద్రాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం సాధించేలా కేసీఆర్ దిశ నిర్దేశం చేశారు.

కథలాపూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రత్యేక సమావేశం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఆదివారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కలిశారు. ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కార్యకర్తలను తరలించి విజయవంతం చేయాలని సూచించినట్టు చెప్పారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించడానికి సైనికుల్లా పనిచేస్తామని కేసీఆర్‌కు హామి ఇచ్చినట్టు తెలిపారు.

లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఎస్పీ పూజలు


అర్చకులు, సిబ్బందితో ఎస్పీ

బీర్‌పూర్, మార్చి 3: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివారం జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ప్రత్యేక పజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎస్పీకి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసా దాలు అందించి ఆశీర్వచనాలను ఇచ్చారు. ఆయన వెంట ఉత్సవ కమిటీ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, బీర్‌పూర్ ఎస్సై గౌతమ్ పవర్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్, సిబ్బంది రాజయ్య, వెంక టేష్ ఉన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, మార్చి 3 : ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆదివారం జిల్లా వైద్యాధికారి శ్రీధర్ ఆవిష్కరించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ ఆరోగ్య శాఖలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ పాత్ర ప్రధాన మైందని రోగులకు సకాలంలో పరీక్షలు నిర్వహించేలా అంకితభావంతో పనిచేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్ ఉన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా


బదిలీపై వెళ్తున్న అడిషనల్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

జగిత్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగులు పదవీ కాలంలో చేసిన ఉత్తమ సేవల వల్లే ప్రజల్లో శాశ్వత గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్‌డీవోలు రాజేశ్వర్, నర్సింహమూర్తి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, డీఆర్‌డీవో నరేశ్, అదనపు డీఆర్‌డీవో సుధీర్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ రాజేశ్వరమ్మ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా బదిలీపై జిల్లాకు వచ్చిన ఆర్‌డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, ఆనంద్ కుమార్‌లకు స్వాగతం పలుకుతూ సత్కరించారు. అదనపు కలెక్టర్ బీఎస్ లతను శాలువలతో సన్మానించడంతో పాటు జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందడం, మంచి పనులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుప్పాల శ్రీధర్, టీఎన్‌జీవో అధ్యక్షుడు శశిధర్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వకీలు, మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్లు, సీనియర్ సిటిజన్‌లు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ తరగతులు

జగిత్యాలరూరల్, మార్చి 3 : జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి సురభి గోశాలలో ఆదివారం మాధవసేవ పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైతులకు గోఆధారిత వ్యవసాయంలో నూతన పద్ధతులు, సాంకేతికలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా టీసీబీటీ, సీబీఆర్ పద్ధతి, సుభాస్‌పలేకర్ పద్ధతి, కూరగాయల నూతనవిధానంపై రైతులకు అవగాహన కల్పించారు. 200 మంది రైతులు శిక్షణకు హాజరై గోఆధారిత, సేంద్రియ వ్యవసాయంపై వారికున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈకార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయానికి కృషి చేయాలి

జగిత్యాల డీఎస్పీ రఘుచందర్


ఠాణాలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

రాయికల్, ఫిబ్రవరి 3: న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించే బాధితులకు అండగా ఉండి సత్వర న్యాయానికి కృషి చేయాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ సూచించారు. రాయికల్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ప్రజలతో మంచి స్నేహ సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేసేలా చర్యలు ఉండాలన్నారు. అంతకుముందు రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో పర్యటించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దర్యాప్తు చేపట్టారు. గ్రామ శివారులో గల నేర స్థలానికి వెళ్లి సాక్ష్యులను విచారించారు. వీరి వెంట ఎస్సై అజయ్ ఉన్నారు.

అడుగంటిన లింగాపూర్ పెద్ద చెరువు

● చెరువు నింపితేనే పొలాలు పండేది ● ఆందోళనలో అన్నదాతలు


అడుగంటిన లింగాపూర్ పెద్ద చెరువు


చెరువు కింద సాగైన వరి పొలాలు

పెగడపల్లి, మార్చి 3 : రోజు రోజుకూ చెరువులో నీరు అడుగంటుతుండటంతో చెరువు కింద ఆయకట్టు రైతులు తమ పొలాలు పండేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు. మండలంలోనే పెద్ద చెరువైన లింగాపూర్ చెరువు కింద 400 ఎకరాల ఆయకట్టు ఉండగా దాదాపు 220 ఎకరాలను రైతులు సాగు చేసి వరి నాట్లు వేశారు. లింగాపూర్ పెద్ద చెరువు పరిధిలో లింగాపూర్‌తో పాటు శాలపల్లి, అడుపపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూములుండగా వారందరికి చెరువు నీరే దిక్కు. ప్రతి సంవత్సరం వర్షాలతో చెరువు నిండుకుండలా ఉండి ఖరీఫ్, రబీ రెండు పంటలు సాగై ఎటు చూసినా పచ్చని పంట పొలాలలతో సస్యశ్యామలంగా కనిపిస్తుండేది. గత సంవత్సరం నుంచి వరదకాలువ ద్వారా మద్దులపల్లి చెరువు మీదుగా లింగాపూర్ చెరువులోకి నీటిని విడుదల చేసి చెరువు నింపేవారు. కాగా ఈ యేడు లింగాపూర్ పెద్ద చెరువులోకి వరదకాలువ నీరు అందకపోవడంతో చెరువు నీటి మట్టం అడుగంటి పోయి నాలుగైదు రోజులైతే తూములకు నీరందని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో తాము వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట పొలాలు ఎండిపోయే పరిస్థితులున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ జీవనాదారమైన పొలాలు ఎండిపోతే ఆత్మహత్యలే శరణ్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి వరదకాలువ నీటిని విడుదల చేసి చెరువు నింపాలని మూడు గ్రామాల రైతులు కోరుతున్నారు.

చెరువు నింపి పంటలను కాపాడాలి

మొగిలి , రైతు- లింగాపూర్



చెరువు నింపి పంటలు ఎండిపోకుండా కాపాడాలి. చెరువు ఎండిపోతే పెట్టిన పెట్టుబడులు పోయి అప్పులపాలు కావాల్సిందే. అధికారులు పట్టించుకుని వెంటనే చెరువు నింపే విధంగా ఏర్పాట్లు చేయాలి.

మల్లికార్జునస్వామి బోనాల జాతర



ఆత్మకూర్‌లో బోనాలతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 3: మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో యాదవులు మల్లికార్జున స్వామి బోనాల జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మల్లికార్జున స్వామి ఆలయంలోని స్వామి వారికి నిర్వహకులు అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి దర్శనానికి మండలంలోని ఆయా గ్రామాల్లోని నుంచి భక్తులు బారులు తీరారు. భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బోనం నెత్తిన ఎత్తుకొని యాదవులు, కురుమ సంఘం సభ్యుల ఒగ్గు డోలు వాయిద్యాలు, శివ సత్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రగా ఆలయానికి బయలు దేరారు. అనంతరం బోనంతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ, కురుమ సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 3: నగరంలోని అంబేద్కర్ స్టేడియం వద్ద ఇద్దరు వ్యక్తులను అనుమానంతో అదుపులోకి తీసుకోగా వారి వద్ద గంజాయి పట్టుబడిందని ఒకటో ఠాణా ఎస్ఐ రవి ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ స్టేడియం వద్ద గన్నేరువరం గ్రామానికి చెందిన కొనగాని మధు, మాకొండూర్ మండలం గంగిపెల్లికి చెందిన బల్ల వెంకటేష్ గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకు న్నామని తెలిపారు. 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న ట్లు తెలిపారు. పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జీలుక వెంకటమ్మ(85) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యానికి గురై నడవలేని స్థితిలో ఇంటి వద్దనే ఉంటోంది. పైగా వృద్ధాప్యం తోడవడంతో జీవితంపై విరక్తి చెందిన శనివారం రాత్రి తన ఇంటి పక్కన ఉన్న చేదబావిలో దూకింది. ఆదివారం తెల్లవారుజామున వెంకటమ్మ శవమై తేలింది. మృతురాలి కుమారుడు కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఓంకార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులతో పాటు కుమార్తె ఉంది.

ఒంటరితనంతో మహిళ..

గంగాధర, మార్చి 3: గంగాధర మండలం గట్టుబూత్కూర్‌కు చెందిన మహిళ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నేరెళ్ల లక్ష్మి(46) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. లక్ష్మికి ఒక కూతురు కాగా కరీంనగర్‌కు చెందిన యువకుడితో వివాహం చేసింది. ఇంట్లో ఒంటరిగా ఉంటూ గ్రామంలో కూలీ పనులకు వెళ్తుండేది. పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరితనం భరించలేక గ్రామ శివారులోని వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ తరలించారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

ధర్మపురి, మార్చి 3: ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బిసగోని వెంకటేష్ (29) అనే యువకుడు అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తొమ్మిదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం జగిత్యాలకు వెళ్లిన వెంకటేష్ అక్కడే డ్రైవర్‌గా పని చేశాడు. మద్యానికి బానిసై అప్పుల పాలై స్వగ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలో కూడా ఎలాంటి పనిచేయకుండా మద్యం తాగి జీవితంపై విరక్తి చెంది ధర్మపురి పట్టణంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేష్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాలువలో పడి యువకుడి మృతి

జ్యోతినగర్, మార్చి 3: స్థానిక మల్కాపూర్ రోడ్డులోని ఎన్టీపీసీ కాలువలో పడి పిట్టల సురేష్(30) అనే యువకుడు మృతిచెందాడు. కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లిన సురేష్ ప్రమాదవశాత్తు కాలువ పడిపోయి చనిపోయాడు. సురేష్ ఫిట్స్‌తో బాధపడుతున్నట్లు సమాచారం. కాలువలో పడిన సమయంలో ఫిట్స్ రావడంతో చనిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎన్టీపీసీ పోలీసులు పరిశీలించారు. మృతుడి తల్లి బాయమ్మ ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ హెడ్ కానిస్టేబుల్ ఎండీ ఖాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పిట్టల సురేష్ (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మార్చి3: మండలంలోని బేతిగల్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న డ్రైవర్ రేగుల భాస్కర్, యజమాని బుడిగే భీరయ్యపై కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

వేడెక్కుతున్న రాజకీయాలు

- 7న సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- వేములవాడలో బహిరంగ సభ
- 12న కరీంనగర్‌లో కేసీఆర్ సభ
- కొనసాగుతున్న బీజేపీ ప్రజాహిత యాత్ర

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రాజకీయ వాతావరణం వేడేక్కుతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి లోక్ సభ స్థానాల్లో పోటీకి నిలపనున్న అభ్యర్థుల ఎంపిక పూర్తి కాక ముందే అన్ని రాజకీయ పక్షాలు పార్టీ ప్రచారంపై దృష్టి సారించాయి. ఏ పేరుతో సభలు సమావేశాలు ఏర్పాటు చేసినా ప్రధాన ఎజెండా లోక్ సభ ఎన్నికలే. కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి బీజేపీ ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేరును పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది ఇంకా తేలలేదు. పెద్దపల్లి లోక్ సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరును ఖరారు చేశారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా ఎవరిని నిలిపేది ఆ పార్టీల నాయకత్వం ఇంకా ప్రకటించలేదు.

● విస్తృతంగా నేతల పర్యటనలు..

బీజేపీ సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన నియోజక వర్గ పరిధిలో ప్రజాహిత యాత్రను చేపట్టి మొదటి విడతను పూర్తి చేసుకుని రెండో విడత పర్యటిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజక వర్గాల్లో 119 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రధాన గ్రామాల మీదుగా పట్టణాల మీదుగా ఆయన యాత్ర పూర్తి చేసుకుని ప్రస్తుతం హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజక వర్గాల్లో ప్రజాహిత యాత్ర కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం కాకున్నా ఈ నెల 7న రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనుండడం రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఆయన 7న సిరిసిల్ల జిల్లా ఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేసి వేములవాడలో శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం గుడి చెరువు మైదానంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. ఎన్నికల సమయం కావడంతో ఈ బహిరంగసభ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. కరీంనగర్ లోక్ సభ నియోజక వర్గ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ప్రజలు ఈ బహిరంగ సభలో పాల్గొననున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచార సభగానే దీనిని భావిస్తున్నారు.



ఈ నెల 12న బీఆర్‌ఎస్ పార్టీ అధినాయకత్వం కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో శంఖారావ సభను నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. మాజీ ముఖ్యమంత్రి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ బహిరంగ సభలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న రెండు పార్లమెంటు స్థానాల అభ్యర్థులను ఆయన ఆదివారం ప్రకటించారు. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఇప్పటి వరకు ప్రతి కీలక సందర్భంలోనూ కరీంనగర్ ప్రధాన పాత్ర పోషిస్తు వస్తూ ట్రెండ్‌సెట్టర్ జిల్లాగా మారింది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే రాజకీయ వాతావరణం వేడేక్కడాన్ని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు

● రాళ్లవాగు కుడికాలువకు గండి పడ్డ ఫలితం ● అడుగంటిన బావులు, చుక్కనీరు రాని బోర్లు ● మరమ్మతుల కోసం రైతాంగం నిరీక్షణ ● రెండు జిల్లాల పరిధిలో ఉండడంతో జాప్యం


భూషణరావుపేట శివారులో పంటల పొలంలో నెర్రెలుబారిన భూమి


నక్కల ఒర్రె వద్ద తెగిన రాళ్ళవాగు కుడికాలువ(ఫైల్)

కథలాపూర్, మార్చి 3: రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువ కింద సాగయ్యే పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలంలో నీటి ఉధృతి కారణంగా కుడికాలువకు నక్కల ఒర్రె వద్ద గండి పడడంతో నీరంతా వాగులోకి వృథాగా పోతోంది. ఈ నేపథ్యంలో కాలువపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాయకులు గండిని పూడ్చడానికి నిధులు తెచ్చి మరమ్మతులు చేస్తారని ఆశించిన అన్నదాతకు కష్టకాలం వచ్చిపడింది. పంటలు ఎక్కడికక్కడ ఎండిపోతుండడంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

● అన్నదాత ఆశలకు 'గండి'

నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ అడవుల్లో నిర్మించిన రాళ్లవాగు ప్రాజెక్ట్ వల్ల జగిత్యాల జిల్లాలోని భూషణరావుపేట, కథలాపూర్, ఊట్‌పల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాల బీడు భూములకు సాగు నీరు అందుతోంది. కుడి కాలువ సుమారు ఏడు కిలోమీటర్లు ఉండగా ఇందులో రెండు కిలోమీటర్లు కమ్మర్‌పల్లి ఇరిగేషన్ విభాగం పరిధిలో ఉంది. మిగిలిన భాగం జగిత్యాల జిల్లా ఇరిగేషన్ పరిధిలోకి వస్తుంది. గండి పడ్డ ప్రాంతం కమ్మర్‌పల్లి అధికారుల పరిధిలోకి వస్తున్న క్రమంలో అంచనాలు రూపొందించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో కుడికాలువ పూర్తిగా జగిత్యాల జిల్లాకు మార్చాలని ఇప్పటికే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులతో చర్చించారు. పూర్తిస్థాయి అంచనాలు వేసి సత్వరమే నివేదిక పంపించాలని ఆదేశించారు. అయితే గండి పడ్డ ప్రాంతంలో మరమ్మతులు చేపడతారేమోననే ఆశతో రబీ సీజన్‌కు సంబంధించి వరి, మిర్చి, మినుము, నువ్వు పంటలు రైతులు సాగు చేసుకున్నారు. ఆ ప్రక్రియకు మోక్షం లభించకపోవడంతో బావులు, బోర్లలో నీళ్లు అడుగంటి సుమారు 200 ఎకరాల మేర పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో రైతులు చేసిన లక్షలాది రూపాయల పెట్టుబడులు నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది.

● మూడు ఎకరాల పొలం ఎండిపోయింది..



పచ్చిమట్ల శ్రీనివాస్, రైతు

రాళ్లవాగు కుడికాలువపై ఆధారపడి మూడెకరాల పొలం సాగు చేసుకున్నాను. కాలువ పక్కనే బావి ఉన్నందు వల్ల భూగర్భజలాలు పుష్కలంగా ఉండేవి. అయితే వర్షాకాలం రాళ్లవాగు కాలువకు గండి పడి నీళ్లన్నీ వాగులోకి పడిపోతున్నాయి. దీంతో బావి పూర్తిగా అడుగంటింది. సుమారు రు. 40 వేలతో బావిలో పూడిక తీసినా ఫలితం కనిపించలేదు. లక్ష రూపాయలకుపైగా నష్టం వాటిల్లింది.

● ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారుల సమన్వయం



గడ్డం చిన్నారెడ్డి, రైతు

రెండు జిల్లాల ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేయడానికి ఎమ్మెల్యే ప్రయత్నం చేయడం శుభపరిణామం. ఇప్పటిదాకా తరచూ తెగిపోతున్న కుడి కాలువకు శాశ్వత మరమ్మతులు చేయని కారణంగా రైతుల పరిస్థితి అగమ్యగోచ రంగా మారింది. ఎమ్మెల్యే అసెంబ్లీలో రాళ్లవాగు మరమ్మతులపై ప్రస్తావించిన నేపథ్యంలో కుడి కాలువ మరమ్మతులకు నోచుకుంటుందని ఆశిస్తున్నాము.

బంగారు నగల బ్యాగ్ అప్పగింత


మహిళకు నగలను అందజేస్తున్న ఏసీపీ కృష్ణ, సీఐ

సుల్తానాబాద్, మార్చి 3: ఓ మహిళ తన బంగారు నగల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోగా, పోలీసులు కొన్ని గంటల్లోనే ఆటోను గుర్తించి బ్యాగ్‌ను బాధిత మహిళకు అందించారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ కృష్ణ వివరాల వెల్లడించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మండల వసంత తన తల్లిగారి గ్రామమైన సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి వచ్చింది. తనకు చెందిన తొమ్మిది తులాల బంగారు నగల బ్యాగ్‌తో ఆదివారం సుగ్లాంపల్లి నుంచి ఆటోలో సుల్తానాబాద్‌కు వచ్చింది. బస్టాండ్‌లో కరీంనగర్ బస్సు ఎక్కే క్రమంలో బంగారు నగల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయింది. వెంటనే వసంత సుల్తానాబాద్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు గోదావరిఖని, కాల్వశ్రీరాంపూర్, కరీంనగర్, పెద్దపల్లి ప్రాంత పోలీసులను అప్రమత్తం చేసి ఆటోలను తనిఖీ చేయించారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి ఆటోను కరీంనగర్ కలెక్టరేట్ వద్ద గుర్తించి తనిఖీ చేయగా నగల బ్యాగ్ లభ్యమైంది. దాన్ని సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత మహిళ వసంతకు ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ వినీత, అశోక్ రమేష్ తదితరులు అందజేశారు.

ఈతవనం దగ్ధం

కథలాపూర్, మార్చి 3: మండలంలోని తుర్తిలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఈత వనం దగ్ధమైంది. 163 సర్వే నంబర్‌లో సుమారు 3.24 ఎకరాల్లో ఈతవనం ఉండగా స్థానిక గీతకార్మికులు కల్లు గీసుకుని జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఈతవనం పూర్తిగా కాలిబూడిద కావడంతో గీతకార్మికులు ఉపాధి కోల్పోయారు. దీంతో తమకు దిక్కుతోచని పరిస్థితి దాపురించిందని బాధిత గీతకార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన న్యూరో వైద్యుల రాష్ట్ర సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ ఏకే పురోహిత్

సుభాష్‌నగర్, మార్చి 3: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తు న్న న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో కిమ్స్, నిమ్స్ వంటి ఆసుపత్రులకు చెందిన నిష్ణాతులైన న్యూరో సర్జన్లు, ప్రొఫెసర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన న్యూరో డాక్టర్లు పాల్గొన్నారు. న్యూరో వైద్య చికిత్సలో వస్తు న్న అధునాతన పద్ధతులు, చికిత్స విధానాలు, అత్యాధునిక ఆపరేషన్ విధానాల గురించి వివరించారు. ముగింపు కార్య క్రమంలో డాక్టర్ ఏకే పురోహిత్ ప్రెసిడెన్షియల్ ఓరింటేషన్ ను అందించారు. డాక్టర్ మానస్ పాణిగ్రహి, డాక్టర్ సుకుమార్ సూర, డాక్టర్ ద్వారకానాథ్‌లు రెనే ఆసుపత్రిలో మెదడులో కంతి తొలగించడం, వెన్నుపాము అత్యాధునిక ఆపరేషన్లను నిర్వహించారు. ఈ సదస్సును డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ పీవీకే కిషోర్, డాక్టర్ జొన్నల శ్రీనివాస్, డాక్టర్ సంజయ్‌లు పర్యవేక్షించారు.

రుద్రవరం ఆలయాల్లో దొంగల బీభత్సం

వేములవాడ టౌన్, మార్చి 3: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని పలు ఆలయాల్లో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని మల్లన్న స్వామి దేవాలయంలోకి చొరబడి గడ్డపారతో హుండీని పగలగొట్టి నగదును, శ్రీస్వామి వారి వెండి ఆభరణాలను అపహరించారు. హనుమాన్ ఆలయంలో సైతం తాళం పగలగొట్టి హుండీలోని నగదును అపహరించుకుపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. రుద్రవరం గ్రామంలోని ఆలయాల్లో దొంగలు పడి హుండీల్లోని నగదును అపహరించుకు వెళ్లడం ఇది మూడోసారి కావడంతో గ్రామస్థులు భయాందోళనకు గురువుతున్నారని చెబుతున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బీజేపీ నాయకుడి మృతి

- పరిహారం చెల్లించాలని నాయకుల డిమాండ్

ఇల్లంతకుంట, మార్చి 3: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు రంగు రమేష్ (41) విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉండే రమేష్ ఉదయం స్నానం చేసి బట్టలు ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పోలీస్‌స్టేషన్ ప్రహరీకి రమేష్ బట్టలు ఆరవేయడానికి ఇనుప వైరును కట్టుకున్నాడు. ప్రహరీ మీదుగా ఎల్‌టీ లైన్ వెలుతోంది. స్తంభానికి ఉన్న డెడ్‌ఎండ్ వైరు వల్ల విద్యుత్ ప్రసరణ జరిగి ఉంటుందని బావిస్తున్నారు. మృతదేహానికి సిరిసిల్లలో పోస్టుమార్టమ్ నిర్వహించి ఇంటికి తీసుకువస్తుండగా బీజేపీ నాయకులు రహీంఖాన్‌పేట గ్రామానికి చేరుకొని వాహనాన్ని నిలిపివేశారు. రమేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని తేల్చిచెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రశాంత్‌రెడ్డి సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డికి సమాచారం అందించారు. సెస్ డైరెక్టర్ చేరుకొని పోస్టుమార్టమ్ రిపోర్టు ఆధారంగా సెస్‌సంస్థ తరపున పరిహారం అందించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.


రమేష్ (ఫైల్)

కుటుంబీకులకు సెస్‌సంస్థలో ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తనపరిధిలో లేనందున తగిన విధంగా అండగా ఉంటానని సెస్ డైరెక్టర్ హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బెంద్రం తిరుపతిరెడ్డి, నాగసముద్రాల సంతోష్, బత్తిని స్వామి, తిప్పారపు శ్రావణ్, మ్యాకల మల్లేశం, దెశెట్టి శ్రీనివాస్, సాయగౌడ్, పున్ని రాజు, వజ్జపల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- 5కే రన్‌కు భారీ స్పందన
- మాధక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ
- హాజరైన యువతీ, యువకులు
- బహుమతులు అందజేసిన కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల క్రైం, మార్చి 3: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఆదివారం ఉదయం నిర్వహించిన 5కే రన్‌కు భారీ స్పందన లభించింది. 5కే రన్‌లో పాలుపంచుకున్న యువతీ, యువకుల్లో ఉత్సాహం, ఉల్లాసం కనిపించింది. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్పీ అఖిల్ మహజన్ జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా, నేతన్నచౌక్, కొత్తచెరువు, చంద్రంపేట మీదుగా తిరిగి అంబేద్కర్‌చౌరస్తా వరకు సాగింది. 5కే రన్‌లో ఓపెన్ కేటగిరిలో రాహుల్, బాలయ్య, సురేష్, (వీర్నపల్లి), విజయ్‌కుమార్, వకీల్ (రుద్రంగి), రజనీకాంత్, రాజు(ఎల్లారెడ్డిపేట), వినోద్‌కుమార్(రంగినేని ట్రస్టు, సిరిసిల్ల), మహిళల కేటగిరిలో హారిక, మౌనిక, విశాల, మౌనిక (తంగళ్లపల్లి), పోలీస్ విభాగంలో దేవరాజు(ఏఆర్ హెడ్‌క్వార్టర్), శంకర్ (ఎల్లారెడ్డిపేట), రవికుమార్ (మీడియా) విజేతలుగా నిలిచారు. విజేతలకు కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహజన్ బహుమతులు, 13 సైకిళ్లు అందజేశారు.

● యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

- కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహజన్

మాధక ద్రవ్యాలను నిర్మూలించి యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. 5కే రన్‌లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతేనన్నారు. అలాంటి యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుపదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తుని అంధకారంలోకి నెట్టేసుకుంటున్నారన్నారు. భావిజీవితానికి అవరోధంగా నిలుస్తున్న మత్తు పదార్థాలను సమాజం నుండి పూర్తిగా నిర్మూలించడానికి ప్రతీ ఒక్కరు నడుం బిగించాలన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.


5కె రన్‌లో పాల్గొన్న ఎస్పీ, చిన్నారులు


విజేతలకు సైకిళ్లను అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ యువత పురోగతికి అవరోధంగా నిలుస్తున్న గంజాయి, ఇతర మత్తుపదార్థాలను నియంత్రించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించడంలో భాగస్వామ్యం కావాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై అనారోగ్యం పాలవుతూ బంగారు భవిష్యత్తును కోల్పోవడమే కాకుండా ఎన్నో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేస్తూ తమ చేతలారా భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. మత్తుపదార్థాలను నిర్మూలించి యువతను మత్తు అనే మహమ్మారి నుంచి కాపాడుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు అన్ని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ క్లబ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయికి అలవాటు పడిన వారిని సన్మార్గంలో నడిపించడానికి డి-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటుచేసి మానసిక వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా ప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని, యువత గంజాయి, డ్రగ్స్, తదితర మత్తు పదార్థాల బారిన పడితే కలిగే అనర్థాలపై మీడియా ద్వారా అవగాహన కల్పించాలన్నారు. 5కే రన్ నిర్వహణకోసం కృషిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు భీం శర్మ, నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, కరుణాకర్, శ్రీనివాస్, కిరణ్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఎస్‌ఐలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చుక్కల మందుకు చక్కటి స్పందన

●జిల్లా వ్యాప్తంగా విజయవంతమైన పల్స్ పోలియో.. ●పాల్గొన్న ప్రజాప్రతినిదులు,అధికారులు


చిన్నారికి చుక్కల మందు వేస్తున్న చైర్ పర్సన్

జగిత్యాల, మార్చి 3 (జగిత్యాల టౌన్): పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని జగిత్యాల బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని మిషన్ కౌంపౌండ్‌లో ఉన్న పీహెచ్‌సీలో ఆదివారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్ పర్సన్ జ్యోతి హాజరై చిన్నారులకు చుక్కల మందు వేసి మాట్లాడారు. పసి పిల్లల నిండు జీవితానికి తప్పనిసరిగా తల్లిదండ్రులు రెండు పోలియో చుక్కల మరిచిపోకుండా వేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీధర్ ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి సీహెచ్‌సీ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతమైంది. ప్రజాప్రతినిధులు చిన్న పిల్లలకు పోలియో చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీహెచ్‌సీ పరిధిలో గల ధర్మపురి, బుగ్గారం మండలాల్లో 35, పట్టణంలో 8 కలిపి ఏర్పాటు చేసిన 43 కేంద్రాల్లో ఐదేళ్ల లోపు చిన్న పిల్లలకు పోలియో చుక్కల మందు వేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. సాయంత్రం వరకు 7321 మంది పిల్లలకు చుక్కల మందు వేయగా 98 శాతం వరకు చేరుకుంది. ఉదయం వరకు పోలియో కేంద్రాలకు సిబ్బంది ద్వారా వ్యాక్సిన్‌ను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, జగిత్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధి కారులు డాక్టర్ శివాసాగరి, డాక్టర్ అవంతి, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, శాంతికుమారి, హెచ్‌ఈవో రాజేశం, సతీష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వెల్గటూర్: పోలియో రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జడ్పీటీసీ సుధారాణి, ఎంపీపీ లక్ష్మి కోరారు. ఆదివారం వెల్గటూర్ మండలంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, మండల వైద్యాధికారి శ్రావణ్‌తో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు భవిష్యత్తులో అంగవైకల్యం రాకుండా ఉండాలంటే తల్లిండ్రులు వారికి చిన్నప్పుడే పోలి యో చుక్కలు వేయించాలని కోరారు. మండలంలో పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం అయింది. మండలంలో 2597 మంది చిన్నారులను గుర్తించగా 2444 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి శ్రావణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కథలాపూర్ : మండలంలోని 19 గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. కథలాపూర్, అంబారిపేట పీహెచ్‌సీల్లో సుమారు 4 వేల మంది ఐదేళ్ల లోపు చిన్నారులు ఉండగా 99 శాతం పోలియో చుక్కలు వేశామని అధికారులు తెలిపారు. గ్రామపం చాయతీల్లో ఉదయం నుంచే చిన్నారుల తల్లిదండ్రులు బారులు తీరి పోలియో చుక్కలు వేయించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి, వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఆశా, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని వివిద గ్రామాల్లో ఆదివారం ప్రభుత్వం వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలీయో కార్యక్రమం 97 శాతం విజయవంతమైంది. మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యాధికారి పరమేశ్వరీ ఆధ్వర్యంలో రెండు రూట్లలో సూపర్‌వైజర్లు వెంకటనర్సమ్మ, శారద, సుదర్శన్ పర్యవేక్షించగా 22 కేంద్రాలలో మండలంలో 4145 మంది చిన్నారులు ఉండగా 3980 మంది చిన్నారులకు వైద్య సిబ్బంది చుక్కలు వేశారు మం దలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో జడ్పీటీసీ ప్రశాంతికృష్ణారావు దంప తులు, కొడిమ్యాలలో ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఎంపీటీసీ జగన్‌మొ హ


రాయికల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్

న్‌రెడ్డి, కొండాపూర్‌లో ఎంపీటీసీ రాజేశ్వరీరాజేందర్ దంపతులు చిన్నారులకు చుక్కలను వేశారు. ఈ కార్యక్రమాలలో సీహెచ్‌వో రాజశేఖర్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెగడపల్లి : మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల మందు కార్యక్రమానికి చక్కటి స్పందన కనిపించింది. 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికి పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఎంపీడీవో ఎనబోయిన శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించగా మండలంలోని 23 గ్రామాలలో 4450 చిన్నారులకు గాను 43 కేంద్రాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి నరేష్ తెలిపారు. ఆయా గ్రామాలలో పలువురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు చుక్కల మందు పంపిణీ కార్యక్రమాల ప్రారంభోత్సవాలలో పాల్గొనగా వైద్య సిబ్బందితో పాటు అంగన్‌వాడీ ఉద్యోగులు చుక్కల మందులు వేశారు.

గొల్లపల్లి: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండలంలో 4265మంది పిల్లలకు గాను 4094 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నరేష్, సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల మందుకు చక్కటి స్పందన లభించింది. 42 కేంద్రాల్లో 168 మంది సిబ్బంది ద్వారా 5,952 మంది చిన్నారులకు పోలియో నివారణ చుక్కల మందు వేశారు. మండల పరిధిలో 6062 మంది చిన్నారులకు చుక్కల మందు వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా 98 శాతం పూర్తయినట్లు డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. కేంద్రాలను తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు సందర్శించారు. రాయికల్ మండలం మైతాపూర్, రాయికల్, కొత్తపేట, మూటపెల్లి, ఒడ్డెలింగాపూర్, చింతలూరు గ్రామాల్లో రాష్ట్ర పరిశీలకులు కట్కం


మెట్‌పల్లి మండలంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ

శంకర్ పరిశీలించారు. చిన్నారులకు పోలియో నివారణ చుక్కల కేంద్రాలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

జగిత్యాలరూరల్: పోలియోరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలియోచుక్కల శిబిరాన్ని ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో ఎంపీపీ మహేష్,


ధర్మపురిలో చుక్కల మందు వేస్తున్న చైర్‌పర్సన్ సత్యమ్మ

రూరల్ మండలంలోని లక్ష్మీపూర్‌లో ఎంపీవో రవిబాబులు పోలియోచుక్కల శిబిరాలను ప్రారంభించారు. అలాగే జగిత్యాల మండలపరిషత్ కార్యాలయంలో పోలియోచుక్కల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ పులి శ్రీధర్ చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ భూమరెడ్డి పాల్గొన్నారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలో ఆదివారం ఎంపీపీ మసర్తి రమేష్ చిన్నారులకు పోలీయో చుక్కలు వేసి ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో నిర్వహించిన పోలీయో కేంద్రాల ద్వారా 0వయస్సు నుంచి 5 సంవత్సరాల వయస్సుగల చిన్నారులకు 97శాతం మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు వైద్యాధికారి రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జయ్‌పాల్‌రెడ్డి, సూపర్‌వైజర్లు కిషోర్ ఫవర్, హేమలత, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పోలియో నిర్మూలన సమాజం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు షాకీర్‌సిధ్దిక్ అన్నారు.

పోలియో జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భం గా ఆదివారం పట్టణంలోని 12వ వార్డుల్లో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన పోలియో చుక్కల పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించి చిన్నారులకు చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, ఏఎన్ఎమ్‌లుపాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాన్ని కేంద్రాన్ని ఎంపీపీ మారు సాయిరెడ్డి ప్రారంభించారు.

అనంతరం వెల్లుల్ల, జగ్గసాగర్, కోం డ్రికర్ల గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వేంపేటలో అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్యయ్యరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, వెల్లుల్లలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ తొగిటి అంజయ్య చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గంభీర్‌పూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ప్రత్యేకాధికారి


పెగడపల్లిలో చుక్కల మందు పంపిణీ ప్రారంభిస్తున్న ఎంపీడీవో


చిన్నారికి చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ ప్రశాంతి


వెల్గటూర్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ సుధారాణి

కుల సంఘ భవనాలకు భూమి విరాళం


ప్రారంభోత్సవానికి సిద్దంగా ఉన●క్లౌ కుల సంఘ భవనాలు

కొడిమ్యాల, మార్చి 3 : మండల జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి(మాజీ సర్పంచు)కృష్ణారావు దంపతులు స్వంత ఊరిపై మమకారం చాటుకున్నారు. మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో సుమారు ఆరు లక్షల రూపాయల విలువైన భూమిని కుల సంఘాల భవనాలకు విరాళంగా అందించారు. అంతే కాకుండా గ్రామంలోని మహిళా సంఘ భవన నిర్మాణానికి రెండు లక్షల రూపాయల విలువైన భూమిని అందించి ఉదారతను చాటుకున్నారు. గ్రామంలోని మహిళా సంఘ భవనం, ముదిరాజు, నాయిబ్రాహ్మణ, శాలీవాహన, గౌడ సంఘ భవనాలకు స్వంత స్థలాన్ని విరాళంగా అందించడమే కాకుండా ప్రభుత్వం నుంచి మంజూరైన సుమారు 16 లక్షల రూపాయలతో భవనాల నిర్మాణం పూర్తి చేయించారు. ఈ నెలలో ప్రారంభోత్సవం చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దంపతులకు, అధికారులకు, కుల సంఘాల సభ్యులు, ప్రజలు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

1967 పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాయికల్, ఫిబ్రవరి 3: రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1967 సంవత్సరంలో హెచ్ఎస్‌సి (ఇంటర్మీడియట్) చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం డాక్టర్ పారుపెల్లి గంగరాజం స్వగృహంలో నిర్వ హించారు. ఈ సమ్మేళనానికి 32 మంది విద్యార్థులకుగాను 28 మంది విద్యార్థులు హాజరయ్యారు. తమ జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ పారేపల్లి గంగరాజం, జగన్ రావు, సూర్యనారాయణ, పెద్దిరెడ్డి, నారాయణ, కృపానందం, కమల, మూర నర్సయ్య, కమలాకర్ రావు, నారాయణ రెడ్డి, కాశీనాథం, అడ్లగట్ల నారాయణ, మురలీధర్ రావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2004-2005 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివా రం ఆత్మీయ సమ్మేళనంగా ఏర్పడ్డారు. విద్యార్థులకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యా యులు, విద్యార్థులు యోగక్షేమాలను పంచుకొని అందరు కలిసి ఒకే చోట భోజనాలు చేసి వేడుకలను నిర్వహిం చుకున్నారు. ఆనాటి మధుర క్షణాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధితిగా ఉపాధ్యాయులు పెద్ది ఆనందంతో పాటు, రత్నసాగర్, అంజయ్య, నాందేవ్, శ్రీనివాస్, కృష్ణలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బీర్‌పూర్‌లో ఒకే వేదికపై ఏర్పడ్డ పూర్వ విద్యార్థులు

బండి సంజయ్‌కి టికెట్ ఖరారుపై బీజేపీ సంబరాలు

కథలాపూర్, మార్చి 3 : కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు మరోసారి బీజేపీ అధిష్టానం టికెట్ కేటాయించడంపై ఆదివారం కథలాపూర్‌లో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్‌లో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కరీంనగర్‌లో మరోసారి బీజేపీ గెలుపు ఖాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గండ్ర విజయ్‌రావు, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం. మల్యాల మారుతి, కాశోజి ప్రతాప్, మహేశ్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు రెండవ సారి కరీంనగర్ ఎంపీ బీజేపీ టిక్కెట్ అదిష్టానం కేటాయించందుకు ఆదివారం మండల కేంద్రంలోని అంగడి బజారులో మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తు టపాసులు కాల్చారు. అనంతరం స్వీట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు బండ నర్సిం హరెడ్డి, చల్ల శ్రీనివాసరెడ్డి, నాగరాజు, నరేష్, శ్రీనివాస్, భూమేష్, మహేందర్, రాజు, రాకేష్ అరుణ్‌కుమార్, కార్తిక్, రవీందర్, అన్వేష్‌రెడ్డి, మహేష్ ఉన్నారు.


కథలాపూర్‌లో సంబారాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మచ్చ శేఖర్

రాయికల్, ఫిబ్రవరి 3: రాయికల్ లయన్స్ క్లబ్ 2024-25 సంవత్సరానికి గాను నూతన అధ్యక్షుడిగా మచ్చ శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాయికల్ పట్టణంలో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కడకుంట్ల నరేష్, కోశాధికారిగా కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షులుగా కుర్మ సుదర్శన్ రెడ్డి, కనపర్తి శ్రీనివాస్‌లు ఎన్నికైనట్లు జడ్‌సి కాటిపెల్లి రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, లయన్స్ క్లబ్ డీసీ మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, కొమ్ముల ఆదిరెడ్డి, గంట్యాల ప్రవీణ్, ఎద్దండి దివాకర్, గంప ఆనందం, దాసరి గంగాధర్, బొమ్మకంటి నవీన్, కొయ్యడి మహిపాల్, సుదవేణి మురళి, రాం ప్రసాద్, గంగాధర్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేతలు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 3: మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శనివారం నిర్వహించడంతో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వేడుకలకు ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మంత్రి శ్రీధర్ బాబును బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ కలిశారు.

ధర్మపురిలో బీఆర్ఎస్ సంబరాలు


దర్మపురిలో టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మపురి, మార్చి 3: ధర్మపురి పట్టణంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పెద్దపల్లి బీఆర్ఎస్ టికెట్ ప్రకటించడం పట్ల ఆదివారం నాయకులు టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరును అధిష్టానం ప్రకటించడం పట్ల స్థానిక నంది చౌక్ వద్దకు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు చేరుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్ర మంలో ధర్మపురి మున్సి పల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్ కుమార్, కౌన్సిలర్ తరాల్ల కార్తీక్, కో-ఆప్షన్ సభ్యులు అప్పాల వసంత్, నేతలు సంగి శేఖర్, గడ్డం బాలరాజు, రవి, మహేష్, రాజేందర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

తంగళ్లపలి, మార్చి 3 : కొద్ది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న తంగళ్లపలి మండలం సారంపల్లికి చెందిన బొప్పెన పర్శరాములు కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు బియ్యం ఆదివారం అందజేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు, కాంగ్రెస్ మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 3: ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సిబ్బంది నర్సింలు కుటుంబానికి కాంగ్రెస్‌ర్దీ నాయకులు 50 కిలోల బియ్యాన్ని ఆదివారం అందించారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణపై అప్రమత్తంగా వ్యవహరించాలి

జగిత్యాల మార్చి 3 (గొల్లపల్లి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల విధులను నిర్వహించే అధ్యాపకులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (475)రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లింగంపల్లి దేవేందర్, ఉపాధ్యక్షుడు రెమిడి మల్లారెడ్డి చెప్పారు. ఆదివారం గొల్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లక్షల మంది విద్యా ర్థుల భవిష్యత్తు ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ తీరుపై ఆధారపడి ఉందన్నారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని బోర్డు కృతనిశ్చ యంతో ఉన్నదని వారు అన్నారు. పరీక్ష విధులలో పాల్గొనే అధ్యాపకులు ఎలాంటి అవకత వకలకు తావు లేకుండా బోర్డు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని వారు సూచించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య చాలా కీలకమని, ఇలాంటి ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రతీ లెక్చరర్‌పై ఉన్నదని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి, కోశాధికారి చలిమెల జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు లింగంపల్లి దేవేందర్

వాలీబాల్ కిట్ అందజేత

పెగడపల్లి, మార్చి 3 : మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన వాలీబాల్ జట్టు సభ్యులకు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి వాలీబాల్ కిట్‌తో పాటు టీషర్ట్‌లను ఆదివారం అందజేశారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నీలో పాల్గొంటున్న నంచర్ల జట్టు సభ్యులను ప్రోత్సహిం చాలనే సదుద్దేశ్యంతో వీటిని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, రామాలయ కమిటీ మాజీ చైర్మన్ విద్యా సాగర్‌రెడ్డి, తిరుపతి, ప్రభాకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

పట్టించుకోని అధికారులు


లీకవుతున్న నీరు

కొడిమ్యాల, మార్చి 3 : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోతోంది. సుమారు 20 రోజులుగా పైపులైన్ లీకవుతున్న అధికారులు ఎవరు పట్టించుకోవటం లేదు. దీంతో బస్టాండ్, ఎస్సీ కాలనీ, గ్రామంలోకి వచ్చి పోయేవారు ఇబ్బందుల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈఈ హరిప్రసాద్‌ను వివరణ కోరగా లీకవుతున్న ప్రాంతంలో రెండు పైపులు ఉన్నాయని మరమ్మతు చేయిస్తానన్నారు.

ధర్మపురి వాసికి కళారత్న నేషనల్ అవార్డు


కళారత్న నేషనల్ అవార్డు అందుకుంటున్న శివప్రసాద్

ధర్మపురి, మార్చి 3: ధర్మపురి పట్టణానికి చెందిన సీనియర్ ఉపాధ్యాయులు, ప్రముఖ వ్యాఖ్యాత బోగ శివప్రసాద్ కళారత్న నేషనల్ అవార్డు 2024 అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం. గౌతం, పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ చెలిమెల సుగుణా కుమారి చేతుల మీదుగా శివప్రసాద్ ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీత బోగ శివప్రసాద్‌ను డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు, మిత్రులు ప్రత్యేకంగా అభినందించారు.